క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



చౌడువాడలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కోటవురట్ల: టెక్నాలజీ పెరిగింది. అంతే స్థాయిలో సైబర్ నేరాలు పెరిగాయి. తగు జాగ్రత్తలు తీసుకోకపోతే అకౌంట్లలోని డబ్బు మాయం కావడం తథ్యం అంటూ కళాజాత బృందం సైబర్ నేరాలపై అవగాహన కల్పించింది. చౌడువాడలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత బృందం బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఎస్‌బీఐ ద్వారా లభిస్తున్న సేవలను కళాకారులు వివవరించారు. అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలపై అవగాహన కల్పించారు. నగదు రహిత సేవలు, ఎస్‌బీఐ యూనో యాప్ ద్వారా అందుతున్న సేవలను వివరించారు.

సంప్రదాయ పశు వైద్యంపై శిక్షణ



శిక్షణకు హాజరైన వారితో పశువైద్య శాస్త్రవేత్త విజయ రాజ్ఞి

రాంబిల్లి : హరిపురం బీసీటీ కేవీకేలో బుధవారం సంప్రదాయ పశు వైద్యంపై విస్తరణ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయ రాజ్ఞి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె పశు వైద్యంపై అవగాహన కల్పించారు. పశువులకు సంక్రమించే వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పశు వైద్యుల సలహా లేకుండా యాంటీ బయోటిక్ మందులు వినియోగించరాదన్నారు. పలు మండలాలకు చెందిన పశు వైద్య సహాయకులు, సిబ్బంది శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కేవీకే కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, భూసార శాస్త్రవేత్త బి. శ్రీహరిరావు, సస్యరక్షణ శాస్త్రవేత్త బి. నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం వద్ద ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలు తొలగింపునకు వచ్చిన అధికారులు

రాంబిల్లి: హరిపురం జనసేన కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం ఫ్లెక్సీలు తొలగించారు. తహసీల్దార్ అప్పలస్వామి, ఎంపీడీవో వెంకటాచలం, సీఐ లక్ష్మణరావు, స్క్వాడ్ అధికారులు కార్యాలయం వద్దకు చేరుకొని ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశించారు. అనుమతులు తీసుకుంటామని అప్పటి వరకు తొలగించవద్దని జనసేన, టీడీపీ కార్యకర్తలు కోరారు. అనుమతులు వచ్చిన తర్వాత పెట్టుకోవాలని తక్షణమే తొలగించాలని ఎంపీడీవో, తహసీల్దా ర్‌లు స్పష్టం చేశారు. దీంతో జనసేన కార్యకర్త లు స్వచ్ఛందంగా ఫ్లెక్సీలు తొలగించారని ఎంపీడీవో వెంకటాచలం విలేకరులకు తెలిపారు.

చూచుకొండలో వెంకన్న ఆలయ వార్షికోత్సవం



చూచుకొండలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: చూచుకొండలో బుధవారం కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ సుందరపు విజయకుమార్ తదితరులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం



సత్యసాయి సేవాసమితి వారు ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ ప్రారంభించిన సమన్వయకర్త కంబాల జోగులు



భక్తులతో నిండిన ఉపమాక వెంకన్న ఆలయ ప్రాంగణం

నక్కపల్లి : ఉపమాక వెంకన్న కల్యాణోత్సవం సందర్భంగా సర్వాభరణాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన శ్రీదేవీభూదేవీ సమేతుడయిన వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ధ్వజస్తంభం ఎదురుగా ఉన్న కల్యాణమండపంలో ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని చూచి తరించేందుకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. స్వామివారికి హెటెరో యాజమాన్యం తరపున కంపెనీ ప్రతినిధులు మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కుళ్లాయి రెడ్డిలు పట్టువస్త్రాలు సమర్పించారు.

అలరించిన కోలాటాలు..: కల్యాణోత్సవాలను పురస్కరించుకుని, పలు ప్రాంతాలనుంచి వచ్చిన ప్రత్యేక భజన బందాలు చేసిన కోలాటం, కూచిపూడి నత్యాలు భక్తులను అలరించాయి. టీటీడీ హిందూ ధర్మప్రచారపరిషత్, అన్నమయ్యప్రాజెక్టువారిచే ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసారు.

హెటెరో ఉద్యోగుల సేవలు : ఉత్సవాలకు తరలి వచ్చిన వేలాదిమంది భక్తులకు హెటెరో ఎంప్లాయీస్‌వారు ఉచితంగా అన్నదాన కార్యక్రమం చేశారు. నక్కపల్లి సత్యసాయి సేవాసమితి సభ్యులు ఉచితంగా పులిహోర మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. నక్కపల్లి నుంచి ఉపమాక వరకు రోడ్డుకు ఇరువైపులా పలువురు స్వచ్ఛందంగా భక్తులకు మజ్జిగ, ప్రసాదం, తాగునీరు సరఫరా చేశారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో దర్శన సమయంలోను, క్యూ కాంప్లెక్స్‌ల వద్ద అన్నదాన కార్యక్రమం వద్ద రద్దీ ఏర్పడింది. గొడిచర్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంవారు, హెటెరో పరిశ్రమవారు ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

షెడ్లలో సేద తీరిన భక్తజనం : స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు ఎండ బారిన పడకుండా టీటీడీవారు రాజగోపురం ఎదురుగా భారీ షెడ్లు వేయడంతో భక్తుల ఉపశమనం పొందారు. షెడ్లకింద సేదతీరారు.

పటిష్ట బందోబస్తు.. : కల్యాణం తిలకించేందుకు వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నర్సీపట్నం డీఎస్పీ జీఆర్‌మోహన్ పర్యవేక్షణలో నక్కపల్లి, అడ్డురోడ్డు, పాయకరావుపేట సీఐలు విజయ్‌కుమార్, అప్పన్న, అప్పలరాజుల ఆధ్వర్యంలో నారాయణరావుల ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. నక్కపల్లి నూకాలమ్మ ఆలయం వద్ద, మనబానవానిపాలెం, ఉపమాక నూకాలమ్మ ఆలయాల వద్ద చెక్‌పోస్టులుఏర్పాటు చేసి వాహనాలను నిలిపివేసి కాలినడకన భక్తులను ఆలయం వద్దకు అనుమతించారు.

వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలి



తిమ్మరాజుపేటలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. తిమ్మరాజుపేటలో ఆమె బుదవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యలమంచిలి ఎమ్మెల్యేగా యు.వి. రమణమూర్తిరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. తద్వారా మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు, మాజీ సర్పంచ్ శరగడం జగన్నాథరావు, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, సచివాలయ కన్వీనర్ రామభద్రనాయుడు, వార్డు సభ్యులు జగన్‌మోహన్‌రావు, పార్టీ నేతలు రామచంద్రరాజు, సత్యనారాయణ, రమేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయంను ప్రారంభించిన ఎంపీ బి.వి.సత్యవతి

పాయకరావుపేట : పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ కార్యాలయాన్ని అనకాపల్లి ఎంపీ బి.వి. సత్యవతి బుధవారం ప్రారంభించారు. పట్టణంలో గల మెయిన్‌రోడ్డు నందు గల పార్కు పక్కన భవనంలో కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జిల్లా పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దేవవరపు వెంకటేశ్వరరావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, పంచాయతీ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, సర్పంచ్ కోడ కోటేశ్వరరావు, పంచాయతీ మెంబర్లు ధనిశెట్టి బాబి, కొప్పిశెట్టి మోహన్, పిరాధి రాజు, కేశనకుర్తి సత్తిబాబు పాల్గొన్నారు.

'ఓటు అడిగే హక్కు మనకే ఉంది'



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బొలిశెట్టి గోవిందరావు తదితరులు

ఎస్.రాయవరం : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మరో అధికారంలోనికి వచ్చేలా కృషి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు అన్నారు. సర్వసిద్ధి గ్రామంలో బుధవారం పరిసర ప్రాంతాలు జీవీపాలెం, పేటసూదిపురం, సైతారుపేట, వేమగిరి, సర్వసిద్ధి గ్రామా ల కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఎన్నికల షెడ్యూల్లు వచ్చేసిందని, ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజల్ని ఓటు అడిగే హక్కు సీఎం జగన్ మోహన్‌రెడ్డి కల్పించారని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. వాటిని వారికి గుర్తు చేసి ఫ్యాను గుర్తుకి ఓటు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కురందాసు గణేష్, ముప్పిన అబ్బాయిదొర, పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఎస్.రాయవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ అల్లాడ నాగరాజు, మహిళా నాయకులు బోయిన లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధువర్మ, కాసెప అప్పన్న, చల్లపల్లి సత్యనారాయణ, శిగిరెడ్డి అప్పారావు, కర్రి సత్యారావు, కుంచాల అప్పారావు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు కూలిన చెట్లు

పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం



పులపర్తిలో విద్యుత్ వైర్లపై కూలిన కొబ్బరి చెట్టు



పీఎన్‌ఆర్‌పేటలో రహదారిపై కూలిన భారీ వృక్షం

యలమంచిలి రూరల్ : మండలంలో బుధవారం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. పీఎస్‌ఆర్‌పేట, బయ్యవరం, పులపర్తి, పురుషోత్తపురం, లక్కవరం, కొత్తలి, ములకలాపల్లి, పోతురెడ్డిపాలెం, రుక్మిణీపురం, రేగుపాలెం తదితర గ్రామాల్లో కొబ్బరి, కానుగ, గంగిరేవు చెట్లు కూలిపోయాయి. పులపర్తిలో విద్యుత్ తీగలపై కొబ్బరిచెట్లు కూలాయి. దీంతో బుధవారం రాత్రి 7.30 గంటల వరకూ విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన అక్కడకు చేరుకుని తెగిపడిన వైర్లు సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

జనుం ఉపయోగాలు ఘనం

- మండలంలోని 120 ఎకరాల్లో జనుం సాగు
- పచ్చిరొట్ట ఎరువు, నార, మిక్చర్‌లో వినియోగం



జనుం సాగు

కశింకోట: జనుం పంట సహజ సిద్ధ ఎరువుగా భూమిని సారవంతం చేస్తుంది. పూత దశలో వలిసె పూల అందాన్ని సంతరించుకుంటుంది. రబీ సీజన్‌లో మండలంలోని రైతాంగం జనుం సాగుపై మక్కువ చూపుతున్నారు. నామమాత్రపు పెట్టుబడితో, అదనపు ఆదాయం సమకూరనుండటం కూడా వీటి సాగుకు ప్రధాన కారణం. మండల గ్రామాల్లో సుమారు 120 ఎకరాల్లో ఈ ఏడాది జనుం సాగవుతోంది. గత ఏడాది 200 ఎకరాలకు పైగా సాగులో ఉండేది. డిసెంబర్లో కురిసిన భారీ వర్షాలకు నీరు నిలిచి, దున్నేందుకు వీల్లేని ప్రాంతాల్లో సాగు జరగలేదు.

ఎకరాకు రూ.25 వేలు రాబడి

జనుంను ఎక్కువగా కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, గొబ్బూరు, జమాదులపాలెం, తాళ్లపాలెం, ఏఎస్ పేట, సోమవరం, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం గ్రామాల్లో ఆరు తడి పంటగా పండిస్తారు. దీనికి పెద్దగా నీరు అవసరం లేదు. మండల రైతాంగం ఈ పంటను సాధారణంగా రబీ సీజన్ లోను, ఖరీఫ్‌కు ముందు వేసవిలో సాగు చేస్తారు. ఖరీఫ్‌లో వేసిన వరి పంట, చెరకు తొలగించిన తర్వాత మడిలో పదును ఉండగానే ఎక్కువ మంది దుక్కి అవసరం లేకుండా జనుం విత్తనాలు నేరుగా జల్లుతారు. మరికొందరు భూమి గుల్ల బారి ఉండటానికి దుక్కి దున్ని పంట వేస్తారు. సుమారు మూడు నెలల్లో ఏపుగా ఎదిగి, కాయలు కాసి పంట చేతికి వస్తుంది. కాయలు ఎండిన తర్వాత వాటి నుంచి గింజలు సేకరిస్తారు. ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. జనుం గింజలు కిలో రూ.50 నుంచి రూ.60 వరకు మార్కెట్‌లో ధర పలుకుతోంది. ఈ లెక్కన ఎకరాకు రూ.25 వేలకు పైనే రాబడి వస్తుంది. రవాణా, సాగు వ్యయం పోనూ ఎకరాకు కనీసం రూ.20 వేలు ఆదాయం మిగులుతుంది.

పచ్చిరొట్ట ఎరువుల్లో కీలకం

వీటిని విత్తనాలుగాను, తినే మిక్చర్ పదార్థంలోను వినియోగిస్తారు. శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో జనుం నార తీసి సంచులు తయారీ చేస్తారు. కేవలం విత్తనాల సేకరణ కోసమైతే ఎకరాకు 10 కిలోలు, పచ్చిరొట్ట ఎరువుగా అయితే 20 కిలోల వంతున జల్లాలి. కిలో విత్తనాలు రూ.60. విత్తనాలు, దుక్కి, పంట సేకరణ వ్యయం మినహా మరే ఇతర వ్యయాలు దీనికి ఉండవు. ఖరీఫ్ సీజన్‌కు ముందు వేసవిలో జనుం సాగు చేస్తారు. ఇది 45 రోజులకు పూత దశకు చేరుతుంది. దీన్ని మొక్కగా ఉండగానే పూర్తిగా దుక్కిలోగానీ, దమ్ములోగానీ కలియదున్నుతారు. ఇది భూమిలో కుళ్లి సహజ సిద్ధమైన ఎరువుగా ఉపయోగపడుతుంది. ఖరీఫ్‌లో ప్రధానంగా సాగుచేసే వరి పంటకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఒక వైపు ఆదాయం కోసం రబీలోను, మరో వైపు భూ సారానికి ఎరువుగా ఉపయోగపడుతుండటం కోసం ఖరీఫ్ సీజన్‌కు ముందు దీన్ని ఎక్కువ మంది రైతులు సాగు చేస్తున్నారు.

వలిశెలను తలపిస్తోన్న జనుం

మండలంలోని పలు గ్రామాల్లో వేసిన జనుం పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. పసుపు రంగు పూలతో అందంగా దర్శనమిస్తోంది. ఇది ఏజెన్సీ ప్రాంతంలో పండించే వలిశెలను తలపిస్తోంది. దీంతో దారిన పోయే వారు ఆసక్తితో ఈ పంట పొలాల వద్ద ఫోటోలు దిగేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

పలకరించిన వరుణుడు



కోటవురట్లలో కురుస్తున్న వర్షం



మునగపాకలో కురుస్తున్న వర్షం



రాంబిల్లి రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

కోటవురట్ల: అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పు చోటుచేసుకుని ఒక్కసారిగా చల్లబడింది. మబ్బులు కమ్ముకుని చిరుజల్లులు పడడంతో ఎండ వేడికి అల్లాడిన జనాలకు ఉపశమనం కలిగింది. మండలంలో బుధవారం చిన్నపాటి వర్షం కురవడంతో సర్వత్రా హర్షాతిరేకం వెల్లువెత్తింది. మార్చి ఆరంభం నుంచి భానుడు ప్రతాపం చూపించడం మొదలెట్టాడు. ఎండలు఼ తారెత్తించాయి. అల్పపీడన ప్రభావంతో చల్లటి గాలులు వీచాయి. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు జిల్లా అంతటా రెండు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు, కొన్ని ప్రాంతాలలో పిడుగులు పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

మునగపాకలో వర్షం

మునగపాక : మండల వ్యాప్తంగా బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు,ప్రజలు సేద తీరారు. కొద్ది రోజులుగా ఎండలు కాయడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం ఈ అకాల వర్షంతో ఊరట చెందారు. వ్యవసాయ పొలాలకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని అధికారులు తెలిపారు. అలాగే ఆరుతడి పంటలకు కూడా వర్షం లాభిస్తుందని వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి తెలిపారు.

అకాల వర్షంతో అవస్థలు

రాంబిల్లి: అకాల వర్షంతో మండల రైతులు అవస్థలు పడ్డారు. మండలంలో పలు గ్రామాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి ఆకాశం మేఘావృతమై పలుమార్లు వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వర్షం నీరు నిలిచింది. అకాల వర్షానికి ముఖ్యంగా రైతులు ఆందోళన చెందారు. వరి, అపరాలు నూర్పులు పనుల్లో వున్న రైతాంగం ధాన్యం, అపరాలు తడిసిపోకుండా పరదాలు కప్పి రక్షణ కల్పించారు. పరదాల కోసం పరుగులు తీశారు. మండలంలో పలు గ్రామాల్లో వరి, అపరాలు నూర్పులు జరుగుతున్నాయి. వర్షం ఎక్కువైతే ధాన్యం , అపరాలు తడిసిపోతాయని రైతులు కలవరపడుతున్నారు.

ఉప్పవరంలో దుర్గమాంబ విగ్రహ ప్రతిష్ట



ఉప్పవరంలో దుర్గమాంబ అమ్మవారి సన్నిధిలో భక్తులు

అచ్యుతాపురం : మండలంలోని ఉప్పవరం గ్రామంలో బుధవారం దుర్గమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రదర్శించిన కోలాటాలు, భజనలు ఆకట్టుకున్నాయి. ఆలయం వద్ద హోమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యే కన్నబాబు రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, దేశంశెట్టి శంకర్‌రావు, పిన్నంరాజు వాసు, కోన బుజ్జి, గంగిరెడ్డి రాము పాల్గొన్నారు.

జీడి, మామిడి తోటలకు మేలు

ఎస్.రాయవరం : మండలంలో మధ్యాహ్నం నుంచి ఓ మోస్తరు, చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం ఈ వర్షం కురుస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ఈ వర్షాల కారణంగా ఖరీఫ్ నాట్లు వేసిన రైతులు, ధాన్యం, అపరాలు నూర్పులు చేసుకుంటున్న పనులు ఆటంకం కలిగించాయని చెబుతున్నారు. అయితే జీడి మామిడి తోటలకు అనుకూలమయిన వాతావరణం కలుగుతోందని చెబుతున్నారు.

అకాలవర్షంతో నువ్వు రైతుల్లో ఆందోళన



యలమంచిలి రైల్వేస్టేషన్ రోడ్డులో కురుస్తున్న వర్షం

యలమంచిలి రూరల్ : మండలంలో బుధవారం ఉదయం నుంచి తేలికపాటి జల్లులతో ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం నుంచి మోస్తరుగా కురిసింది. ఉరుములు, పిడుగులతో వర్షం కురియడంతో యలమంచిలి పట్టణం, మండలంలోని గ్రామాల్లో జనజీవనం స్తంభించింది. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు ప్రస్తుతం రబీ సీజన్‌కు సంబంధించి యలమంచిలి మండలంలో సుమారుగా 350 ఎకరాల్లో నువ్వు పంట సాగులో ఉంది. ఈ వర్షం సాగులో ఉన్న నువ్వుపంటకు మేలే చేస్తుందని, కానీ రెండు, మూడు రోజులు భారీవర్షాలు కురిస్తే పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో అన్ని పంటలకు ఈ క్రాప్ నమోదు చేయించడంతో ఒకవేళ పంటకు నష్టం వాటిల్లినా పంటల బీమా వర్తిస్తుందని యలమంచిలి వ్యవసాయాధికారి పొలిమేర మోహన్‌రావు తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యం

అనకాపల్లి: ఆరోగ్యకరమైన జీవనానికి సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు ఎంతగానో దోహదపడతాయని తుమ్మపాల శారద వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి ప్రతినిధి కోన అప్పారావు అన్నారు. మండలంలోని వెంకుపాలెం, కుంచంగి గ్రామాల్లో రాష్ట్ర జీవ వైవిద్య మండలి సహకారంతో విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం సాగు పద్ధతులు, సేంద్రియ సాగుతో రైతుకు కలిగే లాభాలను వివరించారు. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు వస్తున్న తరుణంలో సేంద్రియ వ్యవసాయం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సమకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు, ఐసీఆర్‌పీలు కృష్ణవేణి, హేమలత, రేవతి, లక్ష్మీమోహిని, వి.చక్రవర్తి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ కల్యాణోత్సవాలు ప్రారంభం

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో 134వ వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి కల్యాణ తంతు వేదమంత్రాల సాక్షిగా పూర్తి చేశారు. పెద్ద ఎత్తున భక్తులు కార్యక్రమాన్ని తిలకించారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం

రోలుగుంట: స్థానిక కొండపైన వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కల్యాణోత్సవాలను ముత్యా రామస్వామి (వైశ్య కుటుంబాలు) ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముత్యాల వారి కుటుంబీకులు సత్యనారాయణ, పెద్దియ్య, నారాయణమూర్తి, నాగేశ్వరరావు తదితరులు అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ శంకుస్థాపన

దేవరాపల్లి: స్థానిక వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు పాల్గొని భక్తిశ్రద్ధలతో భూమి పూజ చేశారు. జై వాసవి, జైజై వాసవి అంటూ భక్తుల నినాదాలతో ఆధ్యాత్మిక సందడి సంతరించుకుంది. కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లలితానాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు తదితర గ్రామ పెద్దలు, ఆర్య వైశ్య సంఘం పెద్దలు పాల్గొన్నారు.